‘ప్రజా పాలన’కు సర్వం సిద్ధం

- నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ
- దరఖాస్తు దాఖలుకు తుది గడువు జనవరి 6
- సమీపంలోని ప్రజా పాలన కౌంటర్‌లో అందజేయాలి

నాంపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన పేరిట అభయ హస్తం గ్యారంటీలకు శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమం గురువారం అధికారికంగా ప్రారంభం అవుతుంది. ఇందులో భాగంగానే ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తుంది. ఇప్పటికే ప్రభుత్వం దరఖాస్తు ఫారాలను విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ దరఖాస్తులను డిసెంబరు 28 నుంచి వచ్చే ఏడాది జనవరి 6వ తేదీ వరకు స్వీకరిస్తారు. నాంపల్లి నియోజకవర్గంలోని ఏడు వార్డుల్లో మొత్తం 28 కేంద్రాలను ఏర్పాటు చేస్తారు. మల్లేపల్లి, రెడ్‌హిల్స్, విజయనగర్ కాలనీ, ఆసిఫ్‌నగర్, అహ్మద్‌నగర్, మెహిదీపట్నం, గుడిమల్కాపూర్ డివిజన్లలో ఏర్పాటు చేసిన కేంద్రాలలో స్వీకరిస్తారు. ఒక్కో వార్డులో వేర్వేరు ప్రాంతాల్లో ఎనిమిదేసి కేంద్రాలు, నాలుగు చొప్పున టేబుళ్లను అమర్చుతారు. ఒక్కో కేంద్రంలో ఒక టీమ్ లీడర్‌తో పాటుగా ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులు విధులను నిర్వహిస్తారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి: ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్

అభయ హస్తం గ్యారంటీలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్ పేర్కొన్నారు. బుధవారం నియోజకవర్గంలోని అంబా గార్డెన్స్‌లో జరిగిన సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో ప్రజా పాలన కార్యక్రమం కొనసాగుతుందన్నారు. జనవరి 6వ తేదీ వరకు సమయం ఉందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. స్పెషల్ ఆఫీసర్ శ్రీవాత్సవ, హైదరాబాద్ ఆర్డీఓ సూర్య ప్రకాష్, ఆసిఫ్‌నగర్ తహసీల్దార్ ఎస్ జ్యోతి, ఏసీపీ వెంకట్‌రెడ్డి, ఎంఐఎం నేతలు పాల్గొన్నారు.

28న పనిచేసే ప్రజా పాలన కార్యక్రమ కేంద్రాలు ఇవే..

మెహిదీపట్నం డివిజన్: జేబా భాగ్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కమ్యూనిటీ హాల్, ఆలపాటి నగర్ జీహెచ్‌ఎంసీ కమ్యూనిటీ హాల్, ఎల్‌ఐసీ కాలనీ జీహెచ్‌ఎంసీ కమ్యూనిటీ హాల్, సంతోష్‌నగర్ కాలనీ జీహెచ్‌ఎంసీ కమ్యూనిటీ హాల్ (అంబా గార్డెన్)లో ప్రజా పాలన దరఖాస్తు స్వీకరణ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

గుడిమల్కాపూర్ :
- శారదానగర్ ఎస్‌బీఐ కమ్యూనిటీ హాల్, నవోదయ కమ్యూనిటీ హాల్, తాళ్లగడ్డ రాజలింగయ్య కబాడ్డీ స్టేడియం, పద్మనాభ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ దరఖాస్తులు స్వీకరిస్తారు.

ఆసిఫ్‌నగర్ :
- ఉషోదయ కాలనీ జీహెచ్‌ఎంసీ వార్డు ఆఫీసు, హుడా కాలనీలోని రవీంద్రనగర్ కమ్యూనిటీ హాల్, కిషన్‌నగర్ సిటీ ఫంక్షన్ హాల్, సాబేర్ నగర్ కెహెచ్‌కె ఫంక్షన్ హాల్‌లో ప్రజా పాలన కేంద్రాలు పనిచేస్తాయి.

విజయగన్ కాలనీ :
- హుమాయూన్‌నగర్ గవర్నమెంట్ లైబ్రరీ బిల్డింగ్, శాంతినగర్ జీహెచ్‌ఎంసీ స్పోర్ట్స్ కాంప్లెక్స్(స్విమ్మింగ్‌పూల్), లేబర్ అడ్డా సమీపంలోని ఫుట్‌బాల్ గ్రౌండ్, కుమ్మరవాడీ జేబా భాగ్ డి–క్లాస్ కమ్యూనిటీ హాల్ ప్రజా పాలన కార్యక్రమ కేంద్రాలు పనిచేస్తాయి.

అహ్మద్‌నగర్ :
- ఎమ్మెల్యే కాలనీ ఆక్స్‌ఫర్డ్ స్కూల్, బడా బజార్ జీహెచ్‌ఎంసీ కమ్యూనిటీ హాల్, పీఎస్‌నగర్ జీహెచ్‌ఎంసీ కమ్యూనిటీ హాల్, ఎంజీనగర్ ఎంజీ నగర్ కమ్యూనిటీ హాల్‌లో ప్రజా పాలన కార్యక్రమ కేంద్రాలు పనిచేస్తాయి.

రెడ్‌హిల్స్ :
- బుడ జంగంబస్తీ లైబ్రరీ బిల్డింగ్ (చింతల బస్తీ), వీర్‌నగర్ కమ్యూనిటీ హాల్, ఏ బ్యాట్రీ లేన్ లక్ష్మీనగర్ కమ్యూనిటీ హాల్, రెడ్‌హిల్స్ జీహెచ్‌ఎంసీ సెంట్రల్ ఎమర్జెన్సీ (రెడ్‌హిల్స్ గ్రౌండ్)లో కేంద్రాలను ఏర్పాటు చేశారు.

మల్లేపల్లి :
- హబీబ్‌నగర్ కమ్యూనిటీ హాల్, ఆగాపురా జాకీర్ హుస్సేన్ కమ్యూనిటీ హాల్, మిస్కన్ షా గ్రౌండ్, అఫ్జల్ సాగర్ కమ్యూనిటీ హాల్‌లో ప్రజా పాలన కేంద్రాలు పనిచేస్తాయి.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్


సమావేశంలో చార్మినార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మహ్మద్ ముజీబ్ ఉల్లా షరీఫ్

ప్రజా పాలన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి..

చార్మినార్: ప్రజా పాలన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చార్మినార్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మహ్మద్ ముజీబ్ ఉల్లా షరీఫ్ కోరారు. బుధవారం మూసాబౌలిలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన కార్యక్రమంలో ఆయా డివిజన్‌లకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని దరఖాస్తుదారులకు అండగా ఉండాలన్నారు. యూసుఫ్, సాబేర్ అలీ, హైదర్ జాఫ్రీ, అమానుల్లా షరీఫ్ పాల్గొన్నారు.

దరఖాస్తు ఫారం ఆవిష్కరణ..

కాంగ్రెస్ ప్రభుత్వం రూపొందించిన దరఖాస్తు ఫారంను సంబంధిత స్పెషలాఫీసర్, జీహెచ్‌ఎంసీ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌లతో కలిసి మహ్మద్ ముజీబ్ ఉల్లా షరీఫ్ బుధవారం ఆవిష్కరించారు. బుధవారం మొగల్‌పురాలోని డీసీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి వారు పాల్గొన్నారు. ప్రజా పాలనను అన్ని డివిజన్‌లలో నిర్వహిస్తున్నామని.. దీనిని సద్వినియోగం చేసుకోవాలని స్పెషలాఫీసర్ కోరారు.

బహదూర్‌పురాలో ..

చార్మినార్: ప్రజా పాలన కార్యక్రమంలో బహదూర్‌పురా నియోజకవర్గానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని దరఖాస్తుదారులకు సహాయంగా పని చేయాలని నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పులిపాటి రాజేష్ కుమార్ (రాహుల్) నాయకులను కోరారు. ఆయన బుధవారం నియోజకవర్గం ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా ఆరు గ్యారంటీలను సీఎం రేవంత్‌రెడ్డి కచ్చితంగా అమలు చేయనున్నారన్నారు.


సమావేశంలో పులిపాటి రాజేష్ కుమార్

పేదలందరూ సద్వినియోగం చేసుకోండి..

గౌలిపురా: ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ఆరు గ్యారంటీలను పథకాలను అర్హులైన పేదలందరూ సద్వినియోగం చేసుకోవాలని యాకుత్‌పురా కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే అభ్యర్థి కె.రవిరాజ్ అన్నారు. సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకునేందుకు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ప్రత్యేకంగా కౌంటర్లను ఏర్పాటు చేశారన్నారు. ఈ కౌంటర్లలో అర్హులైన ప్రజలందరూ తమ దరఖాస్తులను అందజేసి సంక్షేమ పథకాలను పొందాలన్నారు.

ప్రజా పాలనలో అందరికీ సంక్షేమ పథకాలు అందాలి..


సమావేశంలో ఎమ్మెల్యే రాజాసింగ్, తహసీల్దార్ ప్రేమ కుమార్, డీసీ

అబిడ్స్: ప్రజా పాలనలో గోషామహల్ నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు వెంటనే అందించాలని ఎమ్మెల్యే రాజాసింగ్ పేర్కొన్నారు. బుధవారం అబిడ్స్ జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో జరిగిన నియోజకవర్గం ప్రజా పాలన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. గతంలో వేలాదిమంది రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకుంటే ఒక్కరికి కూడా రేషన్ కార్డు అందలేదన్నారు. రేషన్ కార్డుదారులకు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల దారులకు ముందుగా మంజూరు చేయాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చిన ప్రకారం ఆరు గ్యారంటీలను గోషామహల్ ప్రజలకు ప్రజాపాలన ద్వారా అందించాలన్నారు. అర్హులైన వారందరి దరఖాస్తులను స్వీకరిస్తామన్నారు. దరఖాస్తులను స్వీకరించి తర్వాత లబ్ధి పథకాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ 14వ డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ బాలయ్య, తహసీల్దార్ మన్నె ప్రేమ్ కుమార్, కార్పొరేటర్లు భీష్మ సురేఖ, లాల్ సింగ్ శశికళ కృష్ణ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

అర్హులందరూ సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలి

గోల్కొండ: కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు అర్హులందరూ దరఖాస్తు చేసుకోవచ్చునని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. నేటి నుంచి ప్రారంభం కానున్న ప్రజా పాలన సభలపై బుధవారం హకీంపేట్‌లోని ఎస్‌ఎస్ ఫంక్షన్‌హాల్‌లో సన్నాహక సమావేశం జరిగింది. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇందిరమ్మ ఇండ్లు, గృహజ్యోతి, గృహలక్ష్మి తదితర పథకాలకు నేటి నుంచి కార్వాన్ నియోజకవర్గంలో ఆరు ప్రాంతాల్లో ప్రజా పాలన సభలు ఏర్పాటు అవుతున్నాయన్నారు. ప్రజా పాలన సభలలో ఎక్స్ట్రీల కోసం ప్రత్యేకంగా సిబ్బందిని నియమించాలని ఆయన సూచించారు. కార్వాన్ నియోజకవర్గ ప్రజా పాలన సభాధికారి జియావుద్దీన్, గోల్కొండ తహసీల్దార్, బల్దియా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

ఫీజు బకాయిలను చెల్లించాలని వినతి


భట్టి విక్రమార్కను సత్కరిస్తున్న గౌరి సతీష్

నాంపల్లి: రాష్ట్రంలోని జూనియర్ కళాశాలలకు రావాల్సిన ఫీజు బకాయిలను చెల్లించాలని తెలంగాణ రాష్ట్ర ప్రైవేట్ కళాశాలల అధ్యక్షుడు, టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరి సతీష్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసి విన్నవించారు. స్పందించిన భట్టి విక్రమార్క త్వరలోనే సమీక్ష నిర్వహించి బకాయిలను చెల్లిస్తామని హామీ ఇచ్చినట్లు గౌరి సతీష్ తెలిపారు. అనంతరం ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప మహా పడిపూజ


పూజలో దాసరి రాజ్ కుమార్, గోవర్ధన్, రమేష్ గురు స్వామి, సుఖేష్ స్వామి

అబిడ్స్: నేతాజీ నగర్‌లో సుఖేష్ స్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప మహా పడిపూజ భక్తిశ్రద్ధలతో చేశారు. అయ్యప్ప స్వామి భక్తి గీతాలు, భజనలతో ప్రాంతం మారుమోగింది. ఈ మహా పడిపూజలో కాశీ విశ్వనాథ సన్నిధానం గురు స్వామి దాసరి రాజ్‌కుమార్ గురుస్వామి, ఎం. వినోద్ కుమార్ గురు స్వామి, కిరణ్ గురుస్వామి, రమేష్ గురుస్వామి, సన్నిధాన స్వాములతో పాటు నేతాజీ నగర్ కాలనీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి జయ బాబు స్వామి, చైర్మన్ గోవర్ధన్, సాంబశివరావు సుఖేష్ పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప మండల పూజ


పూజలో మాజీ కార్పొరేటర్ ఆలే జితేంద్ర తదితరులు

గౌలిపురా: శ్రీరాంనగర్ కాలనీలోని బాలాజీ ఆలయ (అయ్యప్ప స్వామి ఆలయం) ప్రాంగణంలో మంగళవారం రాత్రి అయ్యప్ప స్వామి మండల పూజా కార్యక్రమాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు వీఎస్.గణేష్ గురుస్వామి, పాటేల్ సదానంద్ యాదవ్ గురుస్వామి ఆధ్వర్యంలో వైభవంగా స్వామి వారికి అభిషేకం, పడిపూజా కార్యక్రమాన్ని ఆధ్యాత్మిక వాతావరణంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గౌలిపురా మాజీ కార్పొరేటర్ ఆలే జితేంద్ర పాల్గొని ప్రత్యేక పూజలు న్విహించారు. బీజేపీ భాగ్యనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండి మహేందర్, జిల్లా అధికార ప్రతినిధి సుమన్ కుమార్ ముదిరాజ్, నాయకులు జమాల్‌పూర్ అశోక్ పాల్గొన్నారు.

ముగిసిన దత్త జయంత్యుత్సవాలు


స్వామి వారి పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు

గౌలిపురా: లాల్‌దర్వాజాలోని దత్త సాయి మందిరంలో శ్రీ దత్త జయంత్యుత్సవాలు బుధవారం పల్లకీ సేవతో ముగిశాయి. ఈనెల 19న ప్రారంభమైన ఈ ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. బుధవారం ఉదయం దత్తాత్రేయ స్వామికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేసిన అనంతరం సాయంత్రం పల్లకీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ పల్లకీ సేవ ఆలయం నుంచి ప్రారంభమై లాల్‌దర్వాజా, లాల్‌దర్వాజా మోడ్, సుధా థియేటర్, గౌలిపురా తదితర ప్రాంతాల్లో కొనసాగింది. ఆలయ పూజారి దత్త ప్రసాద్ దీక్షిత్ ఆధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

నేడు కాంగ్రెస్ సేవాదళ్ శతాబ్ది ఉత్సవాలు


మాట్లాడుతున్న జితేందర్ తదితరులు

గన్‌ఫౌండ్రి: ఈ నెల 28న అఖిలభారత కాంగ్రెస్ సేవాదళ్ శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్ తెలిపారు. బుధవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..నాడు స్వాతంత్ర్య పోరాటంలో ముఖ్య భూమిక పోషించిన సేవాదళ్ ఉత్సవాలను పురస్కరించుకుని గాంధీభవన్‌లో జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా గాంధీభవన్ నుంచి నాంపల్లి స్టేషన్‌రోడ్డు, రవీంద్రభారతి, నెక్లెస్ రోడ్డు మీదుగా ఇందిరా గాంధీ విగ్రహం వరకు భారీ ర్యాలీతో శాంతియాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి సేవాదళ్ నాయకులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

పోరాటాల ద్వారానే హక్కుల సాధన


నియామక ఉత్తర్వులు అందజేస్తున్న రాజలింగం

గోల్కొండ: పోరాటాల ద్వారానే హక్కులను సాధించుకోవచ్చునని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జాతీయ ఎస్సీ, ఎస్టీ ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు టి.రాజలింగం అన్నారు. తెలంగాణ ఫెడరేషన్‌కు నూతనంగా నియమితులైన వారికి ఆయన బుధవారం నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దళితుల అభ్యున్నతికి జాతీయ ప్రాంతీయ పార్టీల వారు చిత్తశుద్ధితో కృషి చేయడం లేదన్నారు. అంబేడ్కర్ ఆశయాలను పూర్తి చేయడానికి మనమంతా కలిసికట్టుగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పి.జగన్నాథం, పి.కన్నయ్య, ఎస్.విల్సన్, ఎస్.మాలాద్రీ, యూ.గీతారాణి, ఎం.అశోక్‌కుమార్, కొమ్ము వరలక్ష్మి తదితరులున్నారు.

మంత్రిని కలిసిన కాంగ్రెస్ నాయకుడు



అఫ్జల్‌గంజ్: తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌ను గోషామహల్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అర్వల్లి శ్రీనివాస్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయంలో మార్యదపూర్వకంగా కలిసి సన్మానించారు.

అయ్యప్ప భక్తులకు సౌకర్యాలు కల్పించేలా కృషి చేయాలి


వేడుకల్లో గడ్డం శ్రీనివాస్ యాదవ్, నరేందర్ యాదవ్

అబిడ్స్: అయ్యప్ప భక్తులకు శబరిమలలో సకల సౌకర్యాలు కల్పించే విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం కృషి చేయాలని గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకుడు, గడ్డం గంగాధర్ ఫౌండేషన్ చైర్మన్ గడ్డం శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. గడ్డం గంగాధర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అయ్యప్ప మహా పడిపూజ పెద్ద ఎత్తున చేపట్టారు. అనంతరం గడ్డం శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ..కేరళలో అయ్యప్ప దర్శనం కోసం వెళ్లిన లక్షలాది మంది అయ్యప్ప భక్తులు ఇబ్బందులు పడుతున్నా కేరళ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. స్వయాన కేరళ హైకోర్టు సైతం అయ్యప్ప భక్తులకు వెంటనే సౌకర్యాలు కల్పించాలని అక్కడి డీజీపీని ఆదేశించినా ఇంతవరకు సౌకర్యాలు మాత్రం నామమాత్రంగానే చేస్తున్నారన్నారు. ఈ వేడుకల్లో బీఆర్‌ఎస్ నాయకులు నరేందర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులను ఆదుకోవాలి


వికలాంగులను సన్మానిస్తున్న లయన్ బాబురావు తదితరులు

గన్‌ఫౌండ్రీ: నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలలో వికలాంగులకు ఇచ్చిన హామీలను త్వరితగతిన అమలు చేయాలని వికలాంగుల సేవా సంస్థ అధ్యక్ష కార్యదర్శులు మంగమ్మ, షణ్ముఖరావు కోరారు. బుధవారం రవీంద్రభారతిలో ప్రపంచ వికలాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గుడ్‌వే ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలువురు వికలాంగులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..వికలాంగులతో ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి తగిన నిధులను కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ప్రముఖ స్వచ్ఛంద సేవకులు లయన్ బాబురావు, పలు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేతల రిమాండ్


వివరాలను వెల్లడిస్తున్న అడిషనల్ డీసీపీ షేక్ జహంగీర్

గౌలిపురా: గంజాయిని విక్రయిస్తున్న ఇద్దరిని రిమాండ్‌కు తరలించిన ఘటనా మొఘల్‌పురా పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దక్షిణ మండలం అడిషనల్ డీసీపీ షేక్ జహంగీర్ ఛత్రినాక ఏసీపీ రమేశ్, మొఘల్‌పురా ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ మధులతో కలిసి వివరాలను వెల్లడించారు. పహాడీషరీఫ్ షాహీనగర్ ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవర్ మహ్మద్ జావేద్ అలియాస్ చాసూ అలియాస్ జగులు (51) జుమ్మెరాత్‌బజార్ అంబేడ్కర్‌నగర్ ప్రాంతానికి చెందిన వినోద్ సింగ్ (45) వద్ద గంజాయి కొనుగోలు చేసి గుట్టు చప్పుడు కాకుండా విక్రయిస్తున్నాడు. వినోద్ సింగ్ ఆంధ్రప్రదేశ్ విశాఖపట్నం సెలేరుకు చెందిన ముత్తుల శ్రీను వద్ద గంజాయిని కొనుగోలు చేస్తూ నగరంలోని పలు ప్రాంతాల్లో విక్రయిస్తున్నాడు. బుధవారం మహ్మద్ జావేద్ తన ఆటోలో గంజాయిని అవసరమైన వారికి విక్రయించేందుకు మెహర్బాన్ హోటల్ జంక్షన్ వద్ద వేచి ఉన్నాడు. జుమ్మెరాత్‌బజార్ రాణి అవంతిబాయి విగ్రహం వద్ద వినోద్ సింగ్ గంజాయి విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఇరువురిని అదుపులోకి తీసుకుని 5.9 కేజీల గంజాయి సాచెట్లను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. మహ్మద్ జావేద్‌పై గతంలో బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మూడు కేసులు, రెయిన్‌బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక కేసు నమోదై ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వినోద్ సింగ్‌పై షాహినాథ్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మూడు గంజాయి కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ సమావేశంలో మొఘల్‌పురా అడిషనల్ ఇన్‌స్పెక్టర్ పండరీ, ఎస్సైలు కృష్ణకాంత్, సుమలత తదితరులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

నాంపల్లి: బాలిక అదృశ్యమైన ఘటన హబీబ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ టంగుటూరి రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం..అఫ్జల్‌సాగర్ మాన్గార్‌బస్తీకి చెందిన కాంబ్లే భారతి, కాంబ్లే జమాల్ కుటుంబం చెత్తకాగితాలు ఏరుకుని జీవనం కొనసాగిస్తున్నారు. వీరి కుమార్తె కాంబ్లే రాఖీ(17) బుధవారం ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. అంతటా వెతికినా ఫలితం లేకపోవడంతో ఆమె తల్లిదండ్రులు హబీబ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి విక్రయిస్తున్న రౌడీషీటర్ అరెస్ట్

విజయనగర్‌కాలనీ: గంజాయి విక్రయిస్తున్న ఓ రౌడీ షీటర్‌ను అరెస్టు చేసిన ఘటన ఆసిఫ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్పెషల్ జోన్ క్రైమ్ టీమ్, సీసీఎస్ ఏసీపీ వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ డి.భిక్షపతి తెలిపిన వివరాల ప్రకారం..ఆసిఫ్‌నగర్ జిర్రా ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవర్ అబ్దుల్ వాజీద్ (30) టప్పాచబుత్ర పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్, ధూల్‌పేట్‌కు చెందిన సురేందర్‌సింగ్, అంగూరి బాయిల వద్ద నుంచి గంజాయి తీసుకువచ్చి ఆసిఫ్‌నగర్‌లో విక్రయిస్తున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు అబ్దుల్‌వాజీద్‌ను అదుపులోకి తీసుకుని 1.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

సెల్‌ఫోన్ స్నాచింగ్.. నిందితుల రిమాండ్

సుల్తాన్‌బజార్: నడుచుకుంటూ వెళ్తున్న ఓ వ్యక్తి వద్ద ముగ్గురు దుండగులు సెల్‌ఫోన్, సిల్వర్ బ్రాస్‌లెట్, రూ.4 వేల నగదును స్నాచింగ్ చేసిన ఘటన సుల్తాన్‌బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కె.ముత్తు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 20న తెల్లవారుజామున 2.30 గంటలకు ఉస్మానియా మెడికల్ కళాశాల బస్‌స్టాప్ వద్ద నారాయణపేటకు చెందిన నరేష్ అనే వ్యక్తి నడుచుకుంటూ వస్తుండగా మహ్మద్ ఫిరోజ్, అనిల్, మరో మైనర్ బాలుడు కలిసి మోటార్ సైకిల్ పైన వచ్చి బాధితుడు నరేష్ వద్ద ఉన్న సెల్‌ఫోన్‌ను‌తో పాటు చేతికి ఉన్న వెండి బ్రాస్‌లెట్, రూ.4 వేల నగదును దోచుకెళ్లారు. బాధితుడు సుల్తాన్‌బజార్ పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. బుధవారం ఉదయం మహ్మద్ ఫిరోజ్, మైనర్ బాలుడిని ఇస్మామియాబజార్‌లో అదుపులోకి తీసుకుని విచారించారు. మహ్మద్ ఫిరోజ్‌ను రిమాండ్‌కు తరలించగా మైనర్‌ను జువైన్ కోర్టుకు పోలీసులు తరలించారు.

ఘనంగా దత్తాత్రేయస్వామి ఊరేగింపు



జియాగూడ: సీతారాంబాగ్ దత్తాత్రేయ గుట్టపై ఉన్న దత్తాత్రేయస్వామి ఆలయంలో రెండురోజుల పాటు జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. బుధవారం సాయంత్రం దత్తాత్రేయస్వామి పల్లకీ ఊరేగింపు ఆలయం నుంచి ఆలయ పరిసరాల్లో ఘనంగా ఊరేగించారు. ఈ కార్యక్రమంలో దత్తాత్రేయస్వామి నవగ్రహ టెంపుల్ డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్ గోకుల్ సింగ్, ప్రధాన కార్యదర్శి అనిల్‌సింగ్, కోశాధికారి అరవింద్‌సింగ్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా జరిగాయి.

కాంగ్రెస్ హయాంలోనే ప్రజా సంక్షేమం



అబిడ్స్: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే అన్నివర్గాల ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి జరుగుతుందని గ్రేటర్ కాంగ్రెస్ నాయకులు మనిలాల్ షా, రాజేందర్ యాదవ్ పేర్కొన్నారు. నగర ఇన్‌చార్జి మంత్రిగా నియమితులైన పొన్నం ప్రభాకర్‌ను వారు కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతామన్నారు. ప్రజలకు స్వచ్ఛమైన పాలన అందించేందుకే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రజా పాలన ప్రవేశపెట్టిందన్నారు.

వైభవంగా నమ్మాళ్వార్ పరమపద మహోత్సవాలు


వేడుకల్లో వేదపండితులు, భక్తులు

చార్మినార్: చార్మినార్ చౌక్ మైదాన్‌లోని బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో నమ్మాళ్వార్ పరమపద మహోత్సవాలు వైభవంగా జరిగాయి. వేద పండితులు శృంగారం రమణాచార్యులు, ఆత్రేయాచార్యులు, పీసపాటి వేణుగోపాలాచార్యులు పాల్గొని ప్రముఖులకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. పూజల అనంతరం స్వామి వారి పల్లకీ ఊరేగింపు కనుల పండువగా జరిగింది. వైకుంఠ ఏకాదశి మహోత్సవాల్లో భాగంగా ఈనెల 23 నుంచి వచ్చే నెల 16వ తేదీ వరకు ఆలయంలో ప్రత్యేక పూజలు జరుగుతాయని ఆత్రేయాచార్యులు తెలిపారు. ఇందులో భాగంగా ఇప్పటికే 23న ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు ముగిశాయన్నారు. అలాగే జనవరి 14న గోదాదేవీ కల్యాణోత్సవాన్ని పెద్ద ఎత్తున నిర్వహించనున్నామన్నారు.

ప్రజా సేవకే జీవితం అంకితం


ధినేష్ మాన్‌సింగ్ చౌదరిని సత్కరిస్తున్న బజ్జుగోప్, గోపాల్ చౌదరి

అబిడ్స్: ప్రజా సేవకే జీవితం అంకితమని ప్రముఖ సంఘ సేవకులు ధినేష్ మాన్‌సింగ్ చౌదరి పేర్కొన్నారు. జీవితాంతం సమాజ సేవకు పాటుపడుతానన్నారు. గోషామహల్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులు బజ్జుగోప్, గోపాల్ చౌదరి, ధినేష్ మాన్‌సింగ్ చౌదరిని ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ధినేష్ మాన్‌సింగ్ చౌదరి మాట్లాడుతూ..తరచు పేదల కోసం సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు.